క్లుప్తంగా

అడిగిన వారందరికీ పనులు

కల్లూరు: జాతీయ ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డు ఉండి అడిగిన వారందరికీ పనులు కల్పిస్తామని డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి అన్నారు. గురువారం ఉలిందకొండ గ్రామం చెరువులో అమృత్ సరోవర్ పథకం కింద చేపడుతున్న పూడిక తీత పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ వాతావరణంలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదు అవుతున్నాయని, కూలీలు ఉదయం 6 గంటలకు వచ్చి 10 గంటల వరకు పని చేసుకోవాలని సూచించారు. పూర్తి వేతనం రూ.272 పొందేలా పనులు చేయాలన్నారు. అనంతరం ఆయన గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. చెట్లమలాపురం గ్రామంలో ఉద్యాన పంటలను సందర్శించి తోటలో అంతర పంటల సాగుపై రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏపీఓ మద్దేశ్వరమ్మ, ఉపాధి పథకం సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలి

కోడుమూరు రూరల్: ప్లాస్టిక్‌పై నిషేధాన్ని మరింత కఠినంగా అమలు చేయాలని డీఆర్‌డీఏ వైకేపీ పీడీ వెంకటసుబ్బయ్య సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచు భాగ్యరత్న, ఈఓ అజయ్‌భాస్కర్, ఏపీఎం పుష్పావతితో పీడీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్లాస్టిక్, చెత్త సేకరణ ప్రక్రియ, ప్రాసెసింగ్ చేయడంపై అవగాహన కల్పించాలన్నారు. పట్టణంలో వ్యాపారస్తులు ఎవ్వరైనా విచ్చలవిడిగా ప్లాస్టిక్‌ను వాడుతున్నట్‌లెతై వారిపై భారీగా జరిమానాలు విధించాలని ఎంపీడీఓ, ఈఓలకు సూచించారు. కోడుమూరులో నిర్వహిస్తున్న మహిళామార్ట్‌ను మరింత అభివృద్ధి చేయాలని పీడీ కోరారు.

ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్తు'

పాణ్యం: 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉత్సాహంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గురువారం పాణ్యంలోని సచివాలయం-2 పరిధిలోని ఎస్సార్బీసీ కాలనీలో ఎంపీపీ హుసేన్‌బీ, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషాలు గడపగడపకు వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరించి ఆయా ఇళ్లకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు. ఈ క్రమంలో జగన్ ఫొటోను చూసి వృద్ధురాలు హుసేన్‌బీ దండం పెట్టి కన్నింటి పర్యంతమయ్యారు. ఇలాంటి పాలన జీవితాంతం ఉండాలని ఆమె ఆకాంక్షించారు. అలాగే సచివాలయం-4 కన్వీనర్ వరద నారాయణ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు.

'ఫ్యామిలీ డాక్టర్'ను ప్రజలకు చేరువచేయాలి

కోడుమూరు: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రజలకు చేరువ చేయాలని వైద్య సిబ్బందికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రామగిడ్డయ్య సూచించారు. గురువారం గూడూరు మండలంలోని కె.నాగులాపురంలో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి ప్రజలకందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. అదేవిధంగా హైస్కూల్‌ను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం కోడుమూరు మండలంలోని అమడగుంట్ల గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. గ్రామంలో నిర్వహిస్తున్న నెలవారీ ఆరోగ్య పరీక్షలపై సిబ్బందిని ఆరా తీశారు.

ఇంజినీరింగ్ విద్యార్థుల ప్రతిభ

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు సింపోజియమ్‌లో ప్రతిభ చాటినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం గురువారం తెలిపారు. ఈ నెల 12వ తేదీ ఆర్‌జీఎంలో జరిగిన 19వ నేషనల్ టెక్నికల్ లెవెల్ సింపోజియమ్‌లో (ఈఈఈ 4వ సంవత్సరం) విద్యార్థినులు బిందుమాధవి ఫోటో ఓల్టాయిక్ అనే అంశంపై, (ఈఈఈ మూడవ సంవత్సరం) అర్చన స్మార్ట్ అగ్రికల్చర్ అనే అంశంలో మొదటి బహుమతులు సాధించినట్లు చెప్పారు. అదేవిధంగా అదే బ్రాంచ్‌కు చెందిన సుభాషిని వైర్‌లెస్ ఎలక్ట్రిసిటీలో ద్వితీయ స్థానం సాధించారన్నారు. ఇందుకు కృషి చేసిన హెచ్‌ఓడీ వీరేష్, విద్యార్థులను ఆయన అభినందించారు.

యాప్‌లో నమోదు చేయాలి

కల్లూరు: ఓటరు కార్డును ఆధార్‌కార్డుకు అనుసంధానం చేసి గరుడ యాప్‌లో నమోదు చేయాలని తహసీల్దార్ టీవీ రమేష్ బాబు అన్నారు. గురువారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానంపై గ్రామీణ ప్రాంతాలకు చెందిన బీఎల్‌ఓలు, వీఆర్వోలతో సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ బీఎల్‌ఓలు ఓటరు కార్డు ఆధార్ అనుసంధానం 72 శాతం చేశారని, త్వరగా 90 శాతానికి చేరుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీవీ రమణమూర్తి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ అనురాధ, ఈఓఆర్డీ రవికిషోర్ పాల్గొన్నారు.

నేడు అంబేడ్కర్ జయంతి

గూడూరు రూరల్: మండల పరిధిలోని గుడిపాడు, బూడిదపాడు, జులకల్ గ్రామాల్లోని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహాల వద్ద శుక్రవారం జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు ఎంఆర్‌పీఎస్ నాయకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొనాలని వారు కోరారు.

జగనన్నది పేదల మేలు కోరే ప్రభుత్వం

- ఎవరి సిఫార్సు లేకుండా అర్హుల ఖాతాలోకి రూ.2 లక్షల కోట్లు జమ
- 'జగనన్నే మా భవిష్యత్తు'లో వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ అమర్నాథ్‌రెడ్డి
- ఇచ్చిన హామీలు నెరవేర్చిన ప్రభుత్వం మాది
- ప్రతిపక్షాల అబద్ధాలను ప్రజలు నమ్మరు: జిల్లా అధ్యక్షుడు రామయ్య



జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో రీజనల్ కోఆర్డినేటర్ ఆకెపాటి అమర్నాథ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కర్రా హర్షవర్ధన్‌రెడ్డి



లబ్ధిదారుల సెల్‌ఫోన్‌కు స్టిక్కర్‌ను అతికిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, చిత్రంలో ఆకెపాటి అమర్‌నాథ్‌రెడ్డి, బీవై రామయ్య, కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి



ఇంటికి జగనన్న స్టిక్కర్ అతికిస్తున్న లబ్ధిదారురాలు

కర్నూలు(రాజ్‌విహార్)/కల్లూరు/కర్నూలు (న్యూ టౌన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది పేదల మేలు కోరే ప్రభుత్వమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక 15వ వార్డు బుధవార పేటలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, నగర మేయర్ బీవై రామయ్యతో కలిసి నిర్వహించారు. అదేవిధంగా 38వ వార్డు మునగాలపాడులో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని వారు కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఏపీఐడీసీ స్టేట్ డైరెక్టర్ పాటిల్ హనుమంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ, 40వ వార్డు కార్పొరేటర్ విక్రమసింహారెడ్డితో కలిసి చేపట్టారు. గత టీడీపీ ప్రభుత్వ పాలన, ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనకు ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలకు వివరిస్తూ గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి మాట్లాడుతూ పేదలు ఆర్థికంగా ఎదగాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో భాగంగానే అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చినట్లు వెల్లడించారు. నాడు చంద్రబాబు ప్రభుత్వం పథకాల అమలులో అవినీతి అడ్డగా మారిందన్నారు. జన్మభూమి కమిటీల సిఫార్సుల మేరకు ఆ పార్టీకి ఓటు వేసిన వారికే పథకాలు మంజూరు చేశారని ఆరోపించారు. దీంతో గత ఎన్నికల్లో ఆ టీడీపీకి గట్టిగా బుద్ధి చెప్పారని, పేదల కష్టాలను కళ్లారా చూసిన సీఎం జగన్‌ను ప్రజలు ఆశీర్వదించడంతో అందుకు తగ్గట్లుగానే పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. ఏ పథకమైనా అక్కాచెల్లెళ్ల పేరు యజమానురాలిగా ఉండాలని అత్యధికంగా మహిళల పేరునే మంజూరు చేశారని, నేరుగా వారి ఖాతాలోకి రూ.2లక్షల కోట్ల నగదు జమ చేస్తూ వస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో 175 స్థానాల్లో గెలవాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యమని ఆ దిశగా అందరూ కలిసికట్టుగా పని చేయాలని సూచించారు.

సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శం

పార్టీ అధ్యక్షుడు బీవై రామయ్య మాట్లాడుతూ సీఎం జగన్ పారదర్శక పాలన దేశానికే ఆదర్శమన్నారు. ఇచ్చిన హామీలను 98శాతం అమలు చేసిన ఏకైక ప్రభుత్వం తమదని, గత చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేక మేనిఫెస్టోను వెబ్‌సైట్ నుంచి తొలిగించిన ఘనత మూటగట్టుకుందన్నారు. తమ సంక్షేమ ప్రభుత్వంపై టీడీపీ నేతలు ఎల్లో మీడియాతో కలిసి అసత్య ప్రచారం చేస్తున్నాయని, వీటిని ప్రజలు నమ్మరనే విషయాన్ని గుర్తు చేశారు. ప్రతిపక్షాల అబద్ధాలను తిప్పికొడతామన్నారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక చేసిన మేలును ప్రజలకు వివరిస్తున్నట్లు చెప్పారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి ఈ నెల 20వ తేదీ వరకు ఇంటింటికి వెళ్లి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు కర్ర హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ తెచ్చిన పింఛన్లు, అమ్మఒడి, జగనన్న గోరుముద్ద, ఆరోగ్య శ్రీ, పేదలకు ఇళ్లు, ఆసరా, చేయుత పథకాలతో ఎంతో మేలు జరిగిందన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు వీటిపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ప్రజలు సలహాలు, సూచనలను ఆయన స్వయంగా నమోదు చేసుకున్నారు.

ప్రతి మహిళను లక్షాధికారిని చేయాలన్నదే లక్ష్యం : ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ మాట్లాడుతూ ప్రతి మహిళను లక్షాధికారిని చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అములు చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే పథకాల నగదును నేరుగా వారి బ్యాంకు ఖాతాలలో జమ చేస్తుండటపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందన్నారు. జగనన్న పారదర్శక పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని చెప్పారు. కోడుమూరు అంటే వైఎస్సార్ అడ్డా అని, 2024 ఎన్నికల్లో పార్టీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటామని ప్రజలే స్వచ్ఛందంగా చెప్పడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రాబోయే 2024 ఎన్నికల్లో అంతటా వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ నాయకులు మాజీ మేయర్ బంగి అనంతయ్య, కేదార్‌నాథ్, వెంకటేశ్వరమ్మ, నాగమణి, సుగుణ, దినకర్, శంకర్, 38వ వార్డులో గృహసారథులు పక్కీరన్న, మహేష్‌గౌడు, ఎల్లాగౌడు, వీరేష్, మాధవ గౌడు, సుంకన్న తదితరులు పాల్గొన్నారు. అనంతరం జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్‌ను ఇళ్లకు, ప్రజల సెల్‌ఫోన్లకు వారి అనుమతితో అతికించి, ప్రభుత్వాన్ని బలపర్చేలా పార్టీ నంబర్ 8296082960 కు మిస్డ్ కాల్ ఇప్పించారు.

పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు



లొద్దిపల్లెలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: సంక్షేమ పథకాలతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పేదల జీవితాల్లో వెలుగులు నింపారని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ అమర్‌నాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం కల్లూరు అర్బన్ 35వ వార్డు 89వ వార్డు సచివాలయం పరిధిలోని చింతలముని నగర్‌లో స్థానిక కార్పొరేటర్ మాధురి, ఇన్‌చార్జ్ వీరయ్య ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మేయర్ బీవై రామయ్య, స్థానిక నాయకులు శ్రీనివాసులు యాదవ్, సుభాన్, కాశన్న, శివారెడ్డి, వలి, వెంకటేశ్వర్లు, కన్వీనర్లు, గృహసారథులు కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా అమర్నాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే కాటసా ని మాట్లాడుతూ.. అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దా రేణుక, కార్పొరేటర్లు శ్రీనివాసులు, అరుణ, డీఎల్ కాంతారెడ్డి, జయరాముడు, డీఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు కృష్ణమూర్తి, సుకన్య, గోపాల్‌రెడ్డి, హనుమంతురెడ్డి, శివశంకర్ రెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు. కాగా ఎమ్మెల్యే కాటసాని చింతలమునిగర్‌లో పర్యటిస్తుండగా వెంకటమ్మవ్వను ఆప్యాయంగా పలకరించారు. జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక వలంటీర్ నేరుగా ఇంటి దగ్గరకే వచ్చి పింఛన్ అందిస్తున్నారని తన సంతోషాన్ని ఎమ్మెల్యేతో పంచుకున్నారు. గతంలో పింఛన్ రూ.1000 మాత్రమే వచ్చేదని, ఇప్పుడు రూ. 2750 ఇస్తున్నారయ్యా అని చెప్పారు. ఇంటి స్థలం మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు.

ఓర్వకల్లు: మండలంలోని లొద్దిపల్లె గ్రామంలో గురువారం సాయంత్రం రెండో రోజు జగనన్ననే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కాటసానితో పాటు, మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి విస్తృతంగా పర్యటించారు. ఇంటింటిని సందర్శించి ' మా నమ్మకం నువే జగన్' స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో సర్పంచు పుష్పమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు నాగశిరీష, స్థానిక నాయకులు ప్రభాకర్‌రెడ్డి, నాగేంద్రారెడ్డి, రాజేశ్వరరెడ్డి, పుల్లారెడ్డి, గజ్జల వెంకటేశ్వర్లు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- రైతులకు వైఎస్సార్ యంత్ర సేవ పథకం ట్రాక్టర్ల పంపిణీ



యంత్ర సేవ పథకం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు: రైతుల అభ్యున్నతికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక మండల సమాఖ్య ప్రాంగణంలో వైఎస్సార్ యంత్ర సేవ పథకం ద్వారా రైతులకు మంజూరైన సబ్సిడీ ట్రాక్టర్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. మండల వ్యవసాయాధికారి సుధాకర్ అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు, కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఏడీఏ శాలురెడ్డి, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, గ్రామ సర్పంచు తోట అనూష ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని, అయితే ప్రస్తుత ప్రభుత్వం అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. మండలంలో రెండు విడతల్లో కలిపి 12 ట్రాక్టర్లు రైతు మిత్ర సంఘాలకు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఒక్కో యూనిట్ ధర రూ.8,86,400 లు కాగా, రైతుల వాటాకింద రూ.4,43, 200లు చెల్లిస్తే, ప్రభుత్వం 40 శాతం సబ్సిడీ కింద రూ.3.40 లక్షలు మంజూరు చేస్తోందన్నారు. అనంతరం ఎమ్మెల్యే సరదాగా ట్రాక్టర్‌ను నడిపి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివనాగప్రసాద్, సింగిల్ విండో చైర్మన్లు నాగతిరుపాలు, చంద్రశేఖర్‌రెడ్డి, దారం రాఘవరెడ్డి, వివిధ గ్రామాలకు చెందిన వ్యవసాయ సలహా మండలి సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టండి

గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ తిప్పన్న అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ఎమ్మెల్యే కాటసానితో పాటు, కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీటీసీలు సరోజమ్మ, గ్రామ సర్పంచు తోట అనూష సభా దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా కస్తూర్బా గాంధీ విద్యార్థినులకు మంజూరైన కంటి అద్దాలను డాక్టర్ అమర్నాథ్‌రెడ్డి, కంటి వైద్యులు సత్యనారాయణ కలిసి ఎమ్మెల్యే కాటసాని చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లోని సమస్యలను అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు. పార్టీ కార్యక్రమాలలో ప్రజా ప్రతినిధులు విబేధాలను విడనాడి కలిసికట్టుగా పని చేయాలన్నారు. ప్రతి గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా పొలం రస్తాలను అభివృద్ధి చేయాలని, వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పేదలు సాగు చేసుకున్న భూములకు అసైన్డు కమిటీ ద్వారా పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. జగనన్న లేఅవుట్లలో రెండో విడత కింద మంజూరైన ఇళ్ల పట్టాలను ఈ నెలాఖరు నాటికి లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, ఎంపీడీఓ శివనాగప్రసాద్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

గూడూరు రూరల్/కోడుమూరు రూరల్: పంటల సాగుకు తప్పనిసరిగా రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని డీఆర్‌సీ ఏడీఏ వేదమణి, కర్నూలు ఏడీఏ సాలురెడ్డి పేర్కొన్నారు. చనుగొండ్లలో, కోడుమూరులో వ్యవసాయ శాఖ సిబ్బందికి గురువారం మట్టి నమూనాల సేకరణపై శిక్షణ ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. మట్టి నమూనా సేకరణ, మట్టి పరీక్షలను తప్పనిసరిగా సచివాలయ సిబ్బంది చేయాలన్నారు. భూమిలో ఏవైనా పోషక లోపాలు ఉంటే మెరుగుపరచుకునేందుకు రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ఏఓలు శ్రీవర్ధన్‌రెడ్డి, రవిప్రకాష్, మల్లేష్ యాదవ్, ఏఈఓలు, వీపీఏలు, జెడ్‌పీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

సి.బెళగల్: గ్రామ వ్యవసాయ సహాయకులు (వీపీఏలు) రైతుల పొలాల్లో భూసార పరీక్షలను పకడ్బందీగా చేపట్టాలని మండల వ్యవసాయాధికారి మల్లేష్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో వారికి భూసార పరీక్షల మట్టి నమూనాల సేకరణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి చేద్దాం



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అధికారులు

సి.బెళగల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ రాముడు అన్నారు. మండల కేంద్రం సి.బెళగల్‌లో గురువారం అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను మండల అధికారుల కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ముందుగా మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహించారు. అనంతరం ఎంపీపీ బొంతల మునెప్ప, జెడ్పీటీసీ సభ్యుడు గిరిజోను, గ్రామ సర్పంచ్ పాండురంగన్న మండల అధికారులతో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ.. అంబేడ్కర్ జీవితంతో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని మహోన్నత వ్యక్తిగా ఎదిగారని, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారని అన్నారు. బుధవారం నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వపు పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివశంకర్‌నాయక్, ఈఓఆర్డీ సందీప్, ఎస్‌ఐ పీరయ్య, వైకేపీ ఏపీఎం వెంకటస్వామి, ఎంఈఓ జ్యోతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మావతి, మల్లేశ్వరి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుల నియామకం

కల్లూరు: 1998 డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు కల్లూరు మండలానికి 16 మందిని కేటాయించినట్లు ఎంఈఓ శ్రీనివాసులు గురువారం తెలిపారు. అందుల్లో 15 మంది ఉపాధ్యాయులు వారికి కేటాయించిన పాఠశాలల్లో జాయిన్ అయ్యారన్నారు. కొత్తగా జాయిన్ వారందరికీ ఎంఈఓ ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. ఉపాధ్యాయులు ఎంఈఓను శాలువాతో సత్కరించారు.

సి.బెళగల్: 1998 డీఎస్సీ ఉపాధ్యాయులు మండలానికి 11 మందిని నియామితులయ్యారని ఎంఈఓ జ్యోతి తెలిపారు. ఈ మేరకు ఎంఈఓ గురువారం తన కార్యాలయంలో వారికి నియామకపత్రాలను అందజేశారు. వారిని మండలంలోని పోలకల్, సి.బెళగల్, కంబదహాల్, ఇనగండ్ల, బురాన్‌దొడ్డి, ఈర్లదిన్నె పలుకుదొడ్డి గ్రామాలలోని ప్రాథమిక పాఠశాలలకు పంపించారు.

తొమ్మిది మంది గైర్హాజరు

సి.బెళగల్: మండలంలో జరుగుతున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు తొమ్మిది మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. గురువారం సైన్స్ పరీక్ష నిర్వహించగా కొత్తకోట జెడ్పీ హైస్కూల్లో నలుగురు, ఏపీ మోడల్ స్కూల్లో ఇద్దరు, సి.బెళగల్ జెడ్పీ హైస్కూల్లో ముగ్గురు చొప్పున గైర్హాజరు అయ్యారని ఆయా పరీక్ష కేంద్రాల నిర్వాహకులు రఘురామిరెడ్డి, వంశీమోహన్, సత్యనారాయణ, బలరాముడు తెలిపారు. సి.బెళగల్ గురుకుల, మోడల్, జెడ్పీ హైస్కూల్ కేంద్రాలలో పరీక్షల నిర్వహణను కర్నూలు డైట్ కళాశాల లెక్చరర్ మువ్వా గోవిందు బృందం పరిశీలించారు.

ప్రతి రోజు 'స్పందన' నిర్వహించాలి

గడివేముల: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ప్రతి రోజు మధ్యాహ్నం స్పందన కార్యక్రమం నిర్వహించాలని ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప ఆదేశించారు. గురువారం మండల పరిధిలోని పెసరవాయి సచివాలయంతో పాటు ఎంపీయూపీ పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి రోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలన్నారు. స్పందనలో వచ్చిన అర్జీలపై నిర్లక్ష్యం వహించకుండా పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని నిర్వాహకులను హెచ్చరించారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డీ ఖాలీక్, వీఆర్వో హరీంద్రా పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకే 'గడప గడపకు'

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



కోడుమూరులో పథకాలను లబ్ధిదారుడికి వివరిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

కోడుమూరు రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. గురువారం కోడుమూరులోని గణేష్‌నగర్, షణ్ముఖరెడ్డి నగర్‌లలో ఎమ్మెల్యే 146వరోజు గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించి నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల అమలు తీరు, ప్రజలెదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇళ్ల పట్టాలిప్పించాలని, సిమెంట్ రోడ్లు, మురుగునీటి కాల్వలను నిర్మించాలని, కొత్త కరెంట్ స్తంభాలు, వీధి లైట్లు వేయించాలంటూ స్థానికులు ఎమ్మెల్యేకు విన్నవించుకోగా వాటి పరిష్కారానికే కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి :

అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ విలేకర్లతో మాట్లాడుతూ గత 70ఏళ్లలో జరగని అభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే కోడుమూరు నియోజకవర్గంలో జరిగిందన్నారు. కోడుమూరులో శాశ్వత నీటి సమస్య పరిష్కారం కోసం గాజులదిన్నె నుంచి కోడుమూరుకు పైపులైన్ వేసేందుకు రూ.25కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించామని, కొన్ని రోజుల్లో గ్రీన్‌సిగ్నల్ వచ్చే అవకాశముందన్నారు. రూ.12కోట్లతో కోడుమూరులో సీసీరోడ్ల నిర్మాణం, హంద్రీనదిపై గోరంట్ల-కొత్తపల్లె బ్రిడ్జి, వర్కూరు తుమ్మలవాగు వంతెనపై బ్రిడ్జి నిర్మాణం తమ ప్రభుత్వ హయాంలోనే జరిగిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషఫణి, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏఓ రవిప్రకాష్, ఏఈలు, గంగరాజు, ప్రసాద్, ఇష్మాయిల్, ఈఓఆర్డీ మంజుల, ఎంఈఓ అనంతయ్య, ఏపీఎం పుష్పావతి, ఈఓ అజయ్‌భాస్కర్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌యాదవ్, మార్కెట్‌యార్డు డైరెక్టర్ ఇమ్మానేయులు, నాయకులు రాజశేఖరరెడ్డి, ప్రభాకర్, ప్రతాప్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, బలరాం, కౌలుట్ల, మల్లేష్, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాలపై దూసుకొచ్చిన మృత్యువు



ప్రమాదంలో మృత్యువాతపడిన గొర్రెలు

ఓర్వకల్లు: బొలేరో వాహనం దూసుకెళ్లడంతో 30 గొర్రెలు మృతి చెందగా, మరో 10 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. గురువారం ఉదయం ఈ సంఘటన మండలంలోని జాతీయ రహదారిపై చెన్నంశెట్టిపల్లె క్రాస్‌రోడ్డు వద్ద చోటుచేసుకోంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు చెన్నంశెట్టిపల్లె గ్రామానికి చెందిన గొల్ల ఎల్లకృష్ణ, గొల్ల తిరుమలేష్, గొల్ల మహేష్ తమ 500 జీవాలను ప్రతి రోజు మేత కోసం తమ్మరాజుపల్లె కొండపైకి తీసుకెళ్లేవారు. రోజు మాదిరిగానే ఉదయం గొర్రెల యజమానులు తమ జీవాలను కొండపైకి తీసుకెళ్తుండగా కర్నూలు నుంచి నంద్యాల వైపు వెళ్లుతున్న బొలేరో ట్రాలీ వాహనం అతివేగంగా గొర్రెల మందపైకి దూసుకొచ్చింది. దీంతో 30 జీవాలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో 10 జీవాలు తీవ్ర గాయాలకు గురయ్యాయి. సుమారు రూ.4 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టనున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

అతివేగానికి ఒకరి బలి

- ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొన్న కారు
- ఒకరి మృతి, నలుగురికి గాయాలు



హైవేలో బోల్తా పడ్డ ట్రాక్టర్



కారులో బాలరాజు మృతదేహం

పాణ్యం: కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిపై పాణ్యం సమీపంలో గురువారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పాణ్యం ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా తోడేళ్లగట్టు గ్రామానికి చెందిన అరట్ల బాలరాజు(35)తో పాటు నిజాంపూర్‌కు చెందిన వినీత్, శంకర్‌పల్లికి చెందిన సుద్దగొని ప్రేమ్, గొల్లపల్లి అభిలాస్ కొత్తగా కొన్న కారులో దైవదర్శనానికి తిరుపతికి బయలుదేరారు. మార్గమధ్యలో పాణ్యం సమీపంలో ఎస్సార్బీసీ ప్రధాన కాల్వ వద్ద కర్నూలు జిల్లా మండల కేంద్రమైన కృష్ణగిరికి చెందిన మధు వరిగడ్డి కోసం ట్రాక్టర్‌లో మహానంది మండలం సీతరామాపురానికి వెళ్తుండగా వెనుక నుంచి కారు ఢీకొంది. దీంతో కారులో డ్రైవర్ పక్కన కూర్చున్న అరట్ల బాలరాజు తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. వినీత్, ప్రేమ్, అభిలాష్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. కారు వేగంగా ఢీకొనడంతో ట్రాక్టర్ హైవేపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మధు గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానిక శాంతిరాం ఆసుపత్రికి 108లో వాహనంలో తరలించారు. ప్రమాదానికి అతివేగమే కారణమని తేల్చారు. కారులో ఎయిర్ బెలూన్ తెరుచుకోవడంతో డ్రైవర్ సీట్లో ఉన్న వినీత్, వెనుక కూర్చున్న మిగతా ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు.

కారులో ఇరుక్కుపోయిన మృతదేహం..

కారు వేగంగా ట్రాక్టర్‌ను ఢీకొనడంతో బాలరాజు మృతదేహం ఇరుక్కుపోయింది. ఎడమ వైపు ఎయిర్ బెలూన్ తెరుచుకున్నా అటు వైపు కారు ముందు భాగం నుజ్జునుజ్జు కావడంతో బెలూన్ పగిలిపోయింది. మృతదేహాన్ని బయటకు తీసేందుకు పోలీసులు హైవే పెట్రోల్‌సిబ్బంది ప్రయత్నించి విఫలమై నంద్యాల అగ్నిమాపక సిబ్బందిని రప్పించారు. వారు గ్యాస్ కట్టర్‌తో కారు డోరును తొలగించి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహాన్ని నంద్యాల ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య శశికళ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి బావమరిది రాఘవేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.